


PRGI No : APTEL/26/A0414

మాకలం బలం కోసం కాదు బలహీనుడి కోసం

# రతనాల వీణ

తెలుగు దినపత్రిక

RATHANAALA VEENA

www.rathanaalaveena.com

Published By | తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ | గురువారం 22-01-2026 | పేజీలు - 4

VOLLUME : 1 ISSUE : 4 EDITOR : S CHANDRASEKHAR REDDY PAGES : 4 PRICE:- 2/-

## తెలంగాణ రైజింగ్‌తో పెరిగిన అంతర్జాతీయ నమ్మకం

**దావోస్,రతనాల వీణ ప్రతినిధి, జనవరి 21 :-** ప్రతి ఏడాది జులై లేదా ఆగస్టులో హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఫాలో-అప్ సదస్సు నిర్వహించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. దావోస్‌లో జరిగిన 'జాయిన్ ది రైజ్' కార్యక్రమంలో ఈ ప్రతిపాదనకు గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పాలసీ నిర్ణేతలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. పెట్టుబడుల ఒప్పందాలు వేగంగా కార్యరూపం దాల్చేందుకు మధ్యంతర ఫోరం అవసరమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. **ఏడాది ఆలస్యం కాదుడ వేగవే అవసరం** ప్రస్తుత ప్రపంచ ఆర్థిక పరిస్థితుల్లో పెట్టుబడుల ఒప్పందాలు, వ్యాపార వాణిజ్య నిర్ణయాలకు ఒక సంవత్సరం చాలా ఎక్కువ సమయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందుకే దావోస్ సమావేశాల మధ్యలో హైదరాబాద్‌లో ఫాలో-అప్ ఫోరం నిర్వహించాలని వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రతినిధులకు సూచించారు. ఇలా జరిగితే ఎంవోయూలు త్వరగా ప్రాజెక్టులుగా మారి, పెట్టుబడులు భూమిపై కనిపిస్తాయని




వివరించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ద్వారా 5.75 లక్షల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు ఆకర్షించామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. గతంలో ఎంవోయూల కోసం మాత్రమే దావోస్‌కు వచ్చేవాళ్లమని, ఈసారి తెలంగాణ రైజింగ్ విజన్, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పాలసీలను ప్రపంచానికి వివరించేందుకే వచ్చామని చెప్పారు. ఈ విజయమే గ్లోబల్ మద్దతుకు కారణమైందన్నారు. **24 గంటల నగరంగా హైదరాబాద్ లక్ష్యం** హైదరాబాద్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లకు ప్రధాన కేంద్రంగా ఎదిగిందని ముఖ్యమంత్రి తెలిపారు. మూసీ నది పునరుజ్జీవనం, రివర్ ఫ్రంట్ అభివృద్ధితో పాటు నైట్ టైమ్ ఎకానమీపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. దేశంలోనే 24 గంటలు పనిచేసే తొలి నగరంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. **భారత్ ఫ్యూచర్ సిటీ, గ్రీన్ అభివృద్ధి :-** భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇందులో 50 శాతం కంటే ఎక్కువ గ్రీన్ కవర్ ఉండేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. అదే వేదికపై తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలు, తెలంగాణ౼× ఇన్నోవేషన్ హబ్ తెలంగాణ నెక్స్ట్-జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026▪2030ను ఆవిష్కరించారు. **- గేమ్-చేంజర్ ప్రాజెక్టులకు గ్లోబల్ భాగస్వామ్యం :-** సమావేశంలో పాల్గొన్న మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి హైదరాబాద్ మెట్రో విస్తరణ, చెరువులు▪కుంటల పునరుజ్జీవనం వంటి కీలక ప్రాజెక్టులను వివరించారు. క్యూర్, ప్యూర్, రేర్ ఆర్థిక వృద్ధి జోన్ల ప్రణాళికలను ప్రస్తావిస్తూ, తెలంగాణలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలున్నాయని చెప్పారు. **- చిరంజీవి హాజరుతో ప్రత్యేక ఆకర్షణ :-** ఈ కార్యక్రమంలో ప్రముఖ నటుడు చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో కలిసి వారు విందులో పాల్గొని గ్లోబల్ ప్రతినిధులతో మమేకమయ్యారు. ఈ భేటీ తెలంగాణకు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకొచ్చిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## ధర్మపురిలో అభివృద్ధి పనులకు శ్రీకారం

**ధర్మపురి,రతనాల వీణ, జనవరి 21 :-** జగిత్యాల జిల్లాలోని పుణ్యక్షేత్రమైన ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా విద్య, సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ధర్మపురి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు భూమి పూజ నిర్వహించినట్లు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, వసతులు కల్పించే లక్ష్యంతో ఒక్కో స్కూల్‌ను సుమారు 25 ఎకరాల్లో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో తొలి





ఏడాదిలోనే 100 స్కూల్‌లకు అనుమతులు ఇచ్చామని, మొత్తం రూ.22,500 కోట్లతో ప్రణాళికలు రూపొందించి మొదటి దశలో రూ.11,500 కోట్ల విలువైన పనులకు శాంక్షన్ ఇచ్చినట్లు వెల్లడించారు. మన బిడ్డల భవిష్యత్తే తెలంగాణ భవిష్యత్తు అని పేర్కొన్న ఉప ముఖ్యమంత్రి, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు చదివి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనులు వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతి నెల బిల్లులు మంజూరు చేయడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.అలాగే ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నిరుపేదలకు గౌరవప్రదమైన జీవితం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. తొలి ఏడాదిలోనే 4.50 లక్షల ఇండ్లకు అనుమతులు ఇచ్చామని, మహిళలను మహాలక్ష్మిలా గౌరవిస్తూ ఇందిరమ్మ చీరలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్,గిరిజన కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణ రావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాగూర్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీలంకలో భారత్ సహకారంతో మరో బైలీ బ్రిడ్జి ప్రారంభం

**కొలంబో,రతనాల వీణ ప్రతినిధి, జనవరి 21 :-** సైక్లోన్ దిత్వా అనంతరం శ్రీలంక పునరుద్ధరణకు భారత్ ప్రకటించిన 450 మిలియన్ డాలర్ల సహాయ ప్యాకేజీలో భాగంగా మరో కీలక మౌలిక వసతి ప్రాజెక్టు పూర్తైంది. కాండీ▪రాగాల రహదారి (దీ-492 హైవే)పై 120 అడుగుల పొడవైన బైలీ బ్రిడ్జి నిర్మాణాన్ని భారత సైన్యానికి చెందిన ఇంజినీర్లు శ్రీలంక అధికారులతో సమన్వయంతో పూర్తి చేశారు. ఇది ఇప్పటివరకు నిర్మించిన మూడవ బైలీ బ్రిడ్జిగా నిలిచింది. ఈ బ్రిడ్జిని భారత్ ఉప హైకమిషనర్ డా. సత్యాంజల్తో పాటు నువారా ఎలియా ఎంపీ మంజుల సురవీర ఆరచ్చి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భారత, శ్రీలంక ప్రభుత్వ ప్రతినిధులు




పాల్గొన్నారు.ఈ బైలీ బ్రిడ్జి ప్రారంభంతో శ్రీలంక మధ్య ప్రావిన్స్‌లో కీలక రవాణా మార్గం తిరిగి అందుబాటులోకి వచ్చింది. దీని ద్వారా ప్రజలకు అవసరమైన సేవలు, స్థానిక మార్కెట్లు, పర్యాటక కేంద్రాలకు చేరుకునే సౌలభ్యం మరింత మెరుగుపడనుందని అధికారులు తెలిపారు. సైక్లోన్ దిత్వా వల్ల దెబ్బతిన్న మౌలిక వసతులను పునర్నిర్మించడంలో భారత్ అందిస్తున్న సహకారం శ్రీలంక ప్రజలకు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తోందని శ్రీలంక ప్రభుత్వం ప్రశంసించింది. భారత్▪శ్రీలంక ద్వైపాక్షిక సంబంధాలు మానవతా సహాయం, మౌలిక వసతుల అభివృద్ధి రంగాల్లో మరింత బలోపేతం అవుతున్నాయని ఈ సందర్భంగా వెల్లడైంది.

## రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసిన స్పెయిన్ విదేశాంగ మంత్రి

**న్యూఢిల్లీ, రతనాల వీణ ప్రతినిధి :-** స్పెయిన్ విదేశాంగ, యూరోపియన్ యూనియన్ మరియు సహకార మంత్రి జోస్ మాన్యువెల్ ఆల్బారెస్ రాష్టపతి భవన్‌లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇండియా▪స్పెయిన్ సంబంధాలపై విస్తృతంగా చర్చ జరిగింది. భారత్▪స్పెయిన్ మధ్య ప్రారంభమైన 'డ్యుయల్ ఇయర్ ఆఫ్ కల్చర్, టూరిజం అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' కార్యక్రమంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతోషం వ్యక్తం చేశారు.



ఈ ద్వై వార్షికోత్సవం ద్వారా రెండు దేశాల మధ్య ఉన్న బలమైన సాంస్కృతిక బంధాలు, ప్రజల మధ్య అనుబంధం మరింత బలపడతాయని ఆమె పేర్కొన్నారు.పర్యాటక రంగంలో కొత్త అవకాశాలు తెరుచుకోనున్నాయని, అలాగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహా సాంకేతిక రంగాల్లో సహకారం మరింత లోతుగా విస్తరించనుందని రాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. ఇండియా▪స్పెయిన్ భాగస్వామ్యం భవిష్యత్‌లో మరింత బలోపేతం అవుతుందన్న విశ్వాసాన్ని ఆమె వ్యక్తం చేశారు. ఈ భేటీతో రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు కొత్త దశలోకి ప్రవేశిస్తున్నాయని దౌత్య వర్గాలు పేర్కొన్నాయి.

## ప్రపంచ బ్యూటీ రంగంలో చారిత్రక అడుగు

**హైదరాబాద్, రతనాల వీణ ప్రతినిది :-**




ప్రపంచ బ్యూటీ రంగంలో అగ్రస్థానంలో ఉన్న లోరియల్ సంస్థ, ప్రపంచంలోనే తొలి బ్యూటీ ▪టెక్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించనున్న ఈ కేంద్రాన్ని ఈ ఏడాది నవంబర్‌లో ప్రారంభించనున్నారు. గ్లోబల్ ఇన్నోవేషన్, టెక్నాలజీ, డేటా నిర్వహణ, సరఫరా వ్యవస్థల కార్యకలాపాలకు హైదరాబాద్‌ను ప్రధాన కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా ఈ జీసీసీ పనిచేయనుంది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక▪ 2026 సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో లోరియల్ సంస్థ సీఈవో నికోలస్ హియెరోనిమస్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులతో బ్యూటీ▪టెక్ జీసీసీ ఏర్పాటు చేసే నిర్ణయాన్ని సంస్థ వెల్లడించింది. ఈ కేంద్రం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న లోరియల్ యూనిట్లకు డిజిటల్ మార్పు, కృత్రిమ మేధ, విశ్లేషణ రంగాల్లో రూపొందించే సాంకేతిక పరిష్కారాలను అందించనున్నారు. ఈ జీసీసీ ఏర్పాటుతో గ్లోబల్ ఎంటర్‌ప్రైజ్ కార్యకలాపాల్లో హైదరాబాద్ ప్రాధాన్యం మరింత పెరుగుతుందని లోరియల్ సీఈవో తెలిపారు. డేటా ఆధారిత నిర్ణయాలు, కృత్రిమ మేధ ఆధారిత వినూత్న పరిష్కారాలు, ఆధునిక సరఫరా వ్యవస్థల నిర్వహణలో హైదరాబాద్ కీలక పాత్ర పోషించనుందని చెప్పారు. నవంబర్‌లో జరగనున్న జీసీసీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి, ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును లోరియల్ సంస్థ ఆహ్వానించింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, లోరియల్ జీసీసీని హైదరాబాద్‌కు తీసుకురావాలన్న ఆలోచనపై ముఖ్యమంత్రి ప్రత్యేక ఆసక్తి చూపారని తెలిపారు. ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మెడ్‌టెక్, హెల్త్‌టెక్‌తో పాటు బ్యూటీ▪టెక్ వంటి కొత్త రంగాల్లోనూ తెలంగాణ ముందంజలో ఉందన్నారు. ఇప్పటికే అనేక గ్లోబల్ సంస్థలు హైదరాబాద్‌లో తమ జీసీసీలను ఏర్పాటు చేశాయని గుర్తుచేశారు. తెలంగాణ కృత్రిమ మేధ ఇన్నోవేషన్ హబ్ సామర్థ్యాలను రాష్ట్ర ప్రతినిధి బృందం వివరించగా, భవిష్యత్తులో మాన్యుఫాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు అవకాశాలపై కూడా లోరియల్ సంస్థ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## బాచుపల్లిలో 2.30 ఎకరాల పార్కు రక్షణ

**బాచుపల్లి,రతనాల వీణ సినిమా, జనవరి 21 :-**




మేడ్చల్▪మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి మండలంలోని బాచుపల్లి గ్రామంలో ఉన్న 2.30 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. సర్వే నంబర్లు 142, 143, 144లో ఉన్న ఈ భూమిని 2016లో అప్పటి జిల్లా కలెక్టర్ ప్రజల కోసం పార్కుగా కేటాయించారు. ఆ మేరకు మొక్కలు నాటి పార్కును అభివృద్ధి చేయడంతో పాటు అర్బన్ నర్సరీని ఏర్పాటు చేసి పచ్చదనాన్ని పెంచారు. పార్కు అభివృద్ధిలో భాగంగా బోర్‌వెల్, వాటర్ సంప్, వాచ్‌మన్ గది, ఇనుప గేట్లు, ఫెన్సింగ్ వంటి మౌలిక వసతులు కూడా ఏర్పాటు చేశారు. అయితే 2023లో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు ఈ పార్కులోని మొక్కలను ధ్వంసం చేసి నర్సరీని తొలగించారు. తమదే భూమి అంటూ రాత్రికి రాత్రి ప్రహరీ నిర్మించి ఆక్రమణలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల ఆధారంగా క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో కలిసి హైడ్రా పరిశీలన చేపట్టింది. పరిశీలనలో ఇది పార్కు స్థలమేనని స్పష్టంగా నిర్ధారణకు వచ్చింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు మంగళవారం ఆక్రమణలను తొలగించి, పార్కు స్థలానికి తిరిగి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిగా సూచిస్తూ హైడ్రా బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. అదే సర్వే నంబర్లలో ఎమ్మార్వో కార్యాలయానికి కేటాయించిన 30 గుంటల ప్రభుత్వ భూమి కూడా ఆక్రమణలకు గురికావడంతో, అక్కడ కూడా హైడ్రా చర్యలు చేపట్టింది. ఆక్రమణలను పూర్తిగా తొలగించి 30 గుంటల భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. పార్కు స్థలం, ప్రభుత్వ భూమి రెండింటినీ కాపాడినందుకు బాచుపల్లి నివాసితులు హైడ్రాకు కృతజ్ఞతలు తెలిపారు. హైడ్రా, ప్రభుత్వానికి మద్దతుగా నినాదాలు చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు.

## కావడిగూడ, ముషీరాబాద్‌లో కొత్త జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయాల ప్రారంభం

**హైదరాబాద్, రతనాల వీణ ప్రతినిది :-**



హైదరాబాద్ నగరంలో పౌర పరిపాలనను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో కావడిగూడ, ముషీరాబాద్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కొత్త జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయాలను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌తో పాటు ప్రజాప్రతినిధులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు. నగర పరిపాలనను వికేంద్రీకరించి, ప్రజలకు సేవలు మరింత వేగంగా అందించడమే ఈ కొత్త సర్కిల్ కార్యాలయాల లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. స్థానిక స్థాయిలోనే సమస్యల పరిష్కారానికి అవకాశం కల్పించడం ద్వారా ప్రజలకు జీహెచ్‌ఎంసీ మరింత చేరువ అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్లు, సర్కిల్ సిబ్బందిని మంత్రి అభినందించారు. పారదర్శకతతో, సమర్థవంతంగా, ప్రజాకేంద్రిత దృక్పథంతో సేవలు అందించడంలో వారు నిబద్ధతతో పనిచేస్తారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కొత్త సర్కిల్ కార్యాలయాల ప్రారంభంతో నగరంలో పౌర సేవల పంపిణీ మరింత మెరుగవుతుందని, ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం పెరుగుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌ను మరింత సుస్థిరంగా, సౌకర్యవంతమైన నగరంగా తీర్చిదిద్దడంలో ఇది కీలక అడుగుగా పేర్కొన్నారు.






## ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్, కృత్రిమ మేధ రంగాల్లో తెలంగాణకు కొత్త ఊపు

**దావోస్,రతనాల వీణ ప్రతినిధి, జనవరి 21 :-**



ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్, కృత్రిమ మేధ రంగాల్లో చేపడుతున్న కార్యక్రమాలను మరింత వేగవంతం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు సందర్భంగా కాలిఫోర్నియాకు చెందిన బ్లైజ్ సంస్థతో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. తక్కువ శక్తి వినియోగంతో పనిచేసే కృత్రిమ మేధ హార్డ్‌వేర్, సంపూర్ణ సాఫ్ట్‌వేర్ వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో బ్లైజ్ సంస్థ ప్రత్యేకత కలిగి ఉంది. ఈ సదస్సులో బ్లైజ్ సంస్థ సహ వ్యవస్థాపకుడు, ప్రధాన కార్యనిర్వాహక అధికారి దినాకర్ మునగాలా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో జరిగిన విస్తృత చర్చల అనంతరం ఇరు పక్షాల మధ్య అధికారికంగా ఒప్పందం కుదిరింది. డేటా సెంటర్లకు అవసరమైన కృత్రిమ మేధ కంప్యూటింగ్ పరిష్కారాల్లో తెలంగాణ కీలక పాత్ర పోషించేలా ఈ భాగస్వామ్యం దోహదపడనుంది. ఇప్పటికే బ్లైజ్ సంస్థ హైదరాబాద్‌లో పరిశోధన, అభివృద్ధి, ఇంజినీరింగ్ కేంద్రాన్ని నిర్వహిస్తోంది. ఈ కేంద్రాన్ని మరింత విస్తరించాలనే ఆలోచనలో సంస్థ ఉందని ప్రతినిధులు వెల్లడించారు. ఆరోగ్య నిర్ధారణ సేవలు, తయారీ రంగ ఆటోమేషన్, శక్తి సామర్థ్యం వంటి విభాగాల్లో కృత్రిమ మేధ ఆధారిత పరిష్కారాలను ప్రయోగాత్మక ప్రాజెక్టులుగా అమలు చేసే అవకాశాలపై కూడా ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణను కృత్రిమ మేధ డేటా సెంటర్ కేంద్రంగా తీర్చిదిద్దడం రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత కీలకమని అన్నారు. రాబోయే రెండు దశాబ్దాల్లో మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధి లక్ష్యాన్ని సాధించాలంటే కృత్రిమ మేధ, డేటా సెంటర్లు, క్వాంటం కంప్యూటింగ్, హార్డ్‌వేర్, ఆటోమేషన్ రంగాల్లో వేగంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. బ్లైజ్ సంస్థ హైదరాబాద్ పరిశోధన కేంద్ర విస్తరణకు ప్రభుత్వం పూర్తి మద్దతు అందిస్తుందని హామీ ఇచ్చారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో తెలంగాణ కృత్రిమ మేధ ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కృత్రిమ మేధ రంగంలో పెట్టుబడులు, పరిశోధనలు, ఆవిష్కరణలకు ఇది వ్యూహాత్మక కేంద్రంగా పని చేస్తుందని చెప్పారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి కృత్రిమ మేధ గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## మున్సిపాలిటీ ఎన్నికల్లో జనసేన జెండా ఎగురవేస్తాం

**మేడ్చల్,రతనాల వీణ, జనవరి 21 (:--**



మేడ్చల్ జిల్లాలో జరగనున్న ఎల్లంపేట్, అలియాబాద్, మూడు చింతలపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో జనసేన పార్టీ జెండా ఎగరడం ఖాయమని జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి నేమూరి శంకర్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. మేడ్చల్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యకర్తలు, నాయకులు, వీర మహిళల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిమ్మకాయల పెద్దిరాజు, గరగ నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, యువకులు, వీర మహిళలు సుమారు 150 మంది జనసేన పార్టీలో చేరినట్లు శంకర్ గౌడ్ తెలిపారు. పార్టీలో చేరిన వారికి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయనడ రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జనసేన పార్టీ ప్రజలకు మరింత చేరువగా ఉంటుందని చెప్పారు. పార్టీ కోసం నిబద్ధతతో, కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జనసేన ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.కె. ఇబ్రహీంతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు. మేడ్చల్ జిల్లాలో జనసేన పార్టీ బలోపేతానికి ఇటువంటి సమావేశాలు కీలకంగా మారుతున్నాయని పార్టీ నేతలు అభిప్రాయపడ్డారు.

## సరూర్‌నగర్ చెరువును పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తాం

**హైదరాబాద్, రతనాల వీణ ప్రతినిది :-**



సరూర్‌నగర్ చెరువును పూర్తిస్థాయిలో పునరుద్ధరించి, వరద నియంత్రణకు ఉపయోగపడేలా అభివృద్ధి చేస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. ప్రభుత్వ అనుమతులు పొందిన వెంటనే పనులు ప్రారంభిస్తామని, మార్చి నెలలోగా పనులకు శ్రీకారం చుడతామని తెలిపారు. బుధవారం సరూర్‌నగర్ చెరువును క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, చెరువు అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. సుమారు 140 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న సరూర్‌నగర్ చెరువు పరిధిలో ఇప్పటికే అనేక నివాసాలు ఏర్పడ్డాయని, ప్రస్తుతం వాటి జోలికి వెళ్లే ఉద్దేశం లేదని హైడ్రా కమిషనర్ స్పష్టం చేశారు. చెరువులో మిగిలి ఉన్న 90 ఎకరాలకు పైగా విస్తీర్ణాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. నగరంలోని పెద్ద చెరువుల అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన సూచనల మేరకే ఈ చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. చెరువుల అభివృద్ధి అంటే కేవలం పైపై మెరుగులు దిద్దడమే కాదని, ఇప్పటికే హైడ్రా పునరుద్ధరించిన బతుకమ్మకుంట, బంరుకున్▪ఉద్▪దౌలా, కూకట్‌పల్లి నల్లచెరువు ప్రాంతాలను పరిశీలిస్తే అది స్పష్టమవుతుందని రంగనాథ్ అన్నారు. సరూర్‌నగర్ చెరువులో 10 నుంచి 15 అడుగుల లోతు వరకు పూడికను తొలగించి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుతామని తెలిపారు. దీని వల్ల భూగర్భ జలాల మట్టం పెరగడంతో పాటు వరదల నియంత్రణకు చెరువు కీలకంగా మారుతుందన్నారు. చెరువు ఇన్‌లెట్లు, ఔట్‌లెట్లు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పర్యావరణ హితంగా చెరువు పరిసరాల్లో ఔషధ గుణాలు కలిగిన మొక్కలను విస్తృతంగా నాటడం, ఇప్పటికే ఉన్న ఇందిరా ప్రియదర్శిని పార్కుతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో కొత్త పార్కుల అభివృద్ధి చేపడతామని హైడ్రా కమిషనర్ తెలిపారు. చెరువు చుట్టూ బండ్, వాకింగ్ ట్రాక్‌లు, చిన్నారుల కోసం క్రీడా పార్కులు, అన్ని వయసుల వారికి ఉపయోగపడే ఓపెన్ జిమ్‌లు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. మురుగు నీరు చెరువులో కలవకుండా వాటర్ బోర్డు సహకారంతో చర్యలు తీసుకుంటామని, ఎస్‌టీపీల సామర్థ్యాన్ని కూడా పెంచుతామని పేర్కొన్నారు. హైడ్రా కమిషనర్ సరూర్‌నగర్ చెరువును సందర్శించడంపై లింగోజిగూడ, గడ్డి అన్నారం కార్పొరేటర్లు దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. హైడ్రా చేపట్టే పనులతో చెరువు సర్వాంగ సుందరంగా మారుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్‌ను శాలువాలతో సత్కరించారు. పర్యటనలో హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, ఏసీపీ తిరుమల్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రతనాల వీణ

ఎడిటర్ : యస్ . చంద్రశేఖర్ రెడ్డి | తెలంగాణ- ఆంధ్రప్రదేశ్ | గురువారం 22-01-2026 | 7


## ముచ్చర్ల సత్యనారాయణ జయంతి సందర్భంగా నివాళులు

**హైదరాబాద్, రతనాల వీణ ప్రతినిది :-**




తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ మంత్రి ముచ్చర్ల సత్యనారాయణ జయంతిని పురస్కరించుకుని బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాల్గొని ముచ్చర్ల సత్యనారాయణ సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ సాధన కోసం ఆయన చేసిన త్యాగాలు, ఉద్యమంలో ఆయన పోషించిన కీలక పాత్రను ఆమె గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో ముచ్చర్ల సత్యనారాయణ చూపిన దార్శనికత, ప్రజాసేవ పట్ల ఉన్న నిబద్ధత తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని జాగృతి నేతలు తెలిపారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ తెలంగాణ సమాజం కోసం పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. ఈ నివాళుల కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొని ముచ్చర్ల సత్యనారాయణకు ఘనంగా నివాళులర్పించారు.

## ముల్కలపల్లిలో ఎగిరిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండా

**యాదాద్రి భువనగిరి,రతనాల వీణ ప్రతినిది, జనవరి 21:-**



యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం తుర్కపల్లి మండలం ముల్కలపల్లి గ్రామంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జెండా ఆవిష్కరణ అనంతరం స్థానిక ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన తీన్మార్ మల్లన్న, తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎందుకు ఏర్పాటు చేయాల్సి వచ్చిందో, ఈ పార్టీ భవిష్యత్ కార్యాచరణ ఏమిటో వివరించారు. 78 ఏండ్లుగా కొనసాగుతున్న రెడ్డి, వెలమల ఆధిపత్య రాజకీయాలను అంతం చేసి, జనాభాలో 90 శాతం ఉన్న వర్గాలకు అధికారాన్ని అందించడమే పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.గ్రామంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల ప్రభావం నుంచి బయటికి వచ్చి, తమ కోసం పుట్టిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండాను ఎత్తాలని ఆయన పిలుపునిచ్చారు. “మన రాజ్యం మనమే సాధించుకుందాం” అంటూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేలా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుదగాని హరిశంకర్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎలబోయన ఓదేలు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ రాజ్, రాష్ట్ర నాయకులు బీకు నాయక్, కొమ్మిశెట్టి నర్సింహులు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బొడ్డుపల్లి చంద్రశేఖర్‌తో పాటు ముల్కలపల్లి టీఆర్పీ నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసీ అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష

**హైదరాబాద్, రతనాల వీణ ప్రతినిది :-**




హైదరాబాద్ నగర అభివృద్ధి, శానిటేషన్ మెరుగుదల లక్ష్యంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నగరంలోని అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ పనులు, హెచ్‌సిటీ, ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టుల వివిధ దశల్లో ఉన్న పనుల పురోగతిపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సమావేశంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో పాటు అడిషనల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.శానిటేషన్ అంశంపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. హైదరాబాద్‌ను క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు రూపొందించిన ప్రణాళికల్లో భాగంగా పలువురు ఇంజనీరింగ్ అధికారులకు ప్రత్యేక బాధ్యతలు కేటాయించాలని, వారి కార్యచరణపై నిరంతర సమీక్ష జరపాలని సూచించారు. చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజ్ సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో ఆలస్యం లేకుండా టైమ్‌లైన్‌లతో ముందుకు వెళ్లాలని, పెండింగ్ వర్క్‌ను ప్రాధాన్యతగా పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. నగర ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశిస్తూ, ప్రాజెక్టుల పురోగతిపై తరచూ సమీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

## కటోరా హౌజ్ పునరుద్ధరణకు పూర్తి సహకారం

**హైదరాబాద్, రతనాల వీణ ప్రతినిది :-**



గోల్కొండ కోట ప్రాంగణంలో ఉన్న 450 ఏళ్ల చరిత్ర కలిగిన కటోరా హౌజ్ పునరుద్ధరణకు హైడ్రా పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. చారిత్రక నీటి వనరుల సంరక్షణ అత్యంత అవసరమని పేర్కొంటూ, కటోరా హౌజ్‌కు పూర్వ వైభవం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.కేంద్ర పురావస్తు శాఖ సంరక్షణలో ఉన్న ఈ చారిత్రక జలాశయాన్ని బుధవారం హైడ్రా కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కటోరా హౌజ్ పరిరక్షణకు నిర్మాణ్ ఎన్‌జీవో ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్మాణ్ ఎన్‌జీవో తరఫున పనులను పర్యవేక్షిస్తున్న కల్పనా రమేష్, అలాగే ఆర్కియాలజీ విభాగం అధికారులు చేపడుతున్న చర్యలను కమిషనర్‌కు వివరించారు.నీటి ట్యాంక్‌లో చెత్త వేయకుండా ఎత్తైన ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం, చుట్టూ పాత్‌వే అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనలు ఉన్నట్లు తెలిపారు. అలాగే ఈ చారిత్రక నీటి వనరులోకి వెళ్లిన మురుగు నీటి పైపు లైన్‌కు ప్రత్యామ్నాయం చూపేందుకు హైడ్రా సహకారం అవసరమని కోరారు. అభివృద్ధి పనుల సమయంలో ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించేందుకు హైడ్రా అనుభవం దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా స్పందించిన హైడ్రా కమిషనర్, కటోరా హౌజ్ జలాశయం పునరుద్ధరణకు హైడ్రా పూర్తిస్థాయిలో సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, అవసరమైన సాంకేతిక సహాయం అందిస్తామని తెలిపారు. చారిత్రక చెరువులు, జలవనరుల పరిరక్షణ భవిష్యత్ తరాల కోసం కీలకమని పేర్కొంటూ, ఈ అభివృద్ధికి సంబంధించిన కార్యాచరణను నివేదిక రూపంలో అందించాలని నిర్మాణ్ ఎన్‌జీవో, ఆర్కియాలజీ శాఖ అధికారులను కోరారు.

## మున్సిపల్ ఎన్నికలకు బీఆర్ఎస్ పూర్తి స్థాయిలో సిద్ధం

**హైదరాబాద్, రతనాల వీణ ప్రతినిది :-**



తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈరోజు మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల కోసం పార్టీ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని స్పష్టం చేస్తూ, మున్సిపాల్టీల వారీగా పార్టీ ఇన్‌చార్జ్‌లను నియమిస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన వారినే బాధ్యతల్లో పెడతామని, రేపు లేదా ఎల్లుండి ఇన్‌చార్జ్‌ల ప్రకటన ఉంటుందని చెప్పారు.జిల్లాల వారీగా సన్నాహక సమావేశాలు ఇప్పటికే పూర్తయ్యాయని, అవసరమైన ప్రచార మెటీరియల్ అంతా సిద్ధంగా ఉందని కేటీఆర్ వెల్లడించారు. సర్వేలు కూడా చేయిస్తున్నామని, వాటి ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని చెప్పారు. మున్సిపల్ ఎన్నికలు స్థానిక ఎన్నికలు కావడంతో అభ్యర్థుల ఎంపిక, ప్రచారం వంటి నిర్ణయాలు స్థానిక నాయకులే తీసుకుంటారని స్పష్టం చేశారు.పంచాయతీ ఎన్నికల్లో 40 శాతం సర్పంచ్ స్థానాలు గెలవడం సామాన్యమైన విషయం కాదని పేర్కొన్న కేటీఆర్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహిస్తారని తాము అనుకోవడం లేదన్నారు. అయినప్పటికీ మున్సిపల్ ఎన్నికలపై పార్టీ అత్యంత సీరియస్‌గా పనిచేస్తోందని చెప్పారు. స్థానిక నేతల ఆధ్వర్యంలోనే ప్రచారం కొనసాగుతుందని, ఎన్నికల కోఆర్డినేటర్లను కూడా నియమిస్తామని తెలిపారు.‘బస్తీ బాట’ కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి వెళ్లి, గత పదేళ్లలో చేసిన అభివృద్ధి పనులు, కాంగ్రెస్ ప్రభుత్వం ఆపేసిన పనులు, ప్రస్తుతం ఉన్న సమస్యలను ప్రజలకు వివరిస్తున్నామని కేటీఆర్ అన్నారు. కొత్త జిల్లాల్లో జిల్లాలు ఎత్తేస్తారన్న ఆందోళన ప్రజల్లో తీవ్రంగా ఉందని, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే అదే జరిగేందుకు అనుమతి ఇచ్చినట్లేనని ప్రజలకు వివరిస్తామని చెప్పారు. ఈ అంశాన్ని మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన అస్త్రంగా ఉపయోగిస్తామని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారశైలిపై స్పందిస్తూ, సీఎం ఏమి చేసినా అది ఆయన ఇష్టమని, తమ పని తాము చేసుకుంటామని వ్యాఖ్యానించారు. సీఎం కాలికి బలపం కట్టుకుని తిరిగినా సర్పంచ్ ఎన్నికల్లో ఎన్ని స్థానాలు వచ్చాయో ప్రజలందరూ చూశారని అన్నారు. పటాన్‌చెరులో కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా బీఆర్ఎస్‌కే ఓటు వేయమని చెబుతున్న పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు.లేని ‘ఫ్యూచర్ సిటీ’ పేరుతో జంట నగరాల అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సికింద్రాబాద్‌లో స్థానికులు చేస్తున్న ఉద్యమానికి కూడా సీఎం జవాబు ఇవ్వాలని అన్నారు. అలాగే ‘ఫార్ములా ఈ’ విషయంలో గ్రీన్‌కోకు లబ్ధి చేకూర్చామంటూ ఆరోపణలు చేస్తున్నారని, అదే గ్రీన్‌కోతో దావోస్‌లో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరుపుతోందని విమర్శించారు. గ్రీన్‌కోను కాపాడేందుకు బ్యాగులు తీసుకుంటున్నారా అంటూ ప్రశ్నించారు.మొత్తంగా మున్సిపల్ ఎన్నికల్లో స్థానిక సమస్యలనే ఎజెండాగా ముందుకు తీసుకెళ్లి, బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

## రోడ్డు ప్రమాదాల్లో యువత ప్రాణాలు కోల్పోతుండటం ఆందోళనకరం

**వరంగల్,రతనాల వీణ ప్రతినిధి , జనవరి 21 :-**



నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో ఎంతో భవిష్యత్తు ఉన్న యువతను కోల్పోతున్నామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. రహదారి ప్రమాదాల నివారణ లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘ఆరైవ్ ఆలైవ్’ కార్యక్రమంలో భాగంగా, వరంగల్ ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో భీమారం స్కిల్ స్టోక్ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్‌తో పాటు వర్ధన్నపేట శాసనసభ్యుడు కె.ఆర్. నాగరాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, దేశంలో జరిగే హత్యలతో పోలిస్తే రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. గత ఏడాది తెలంగాణలో సుమారు 7,500 మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు.వాహనదారుల నిర్లక్ష్యం వల్ల తమతో పాటు ఇతరుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడుతున్నాయని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనం నడపడం వల్ల జరిగే ప్రమాదాలు ఇటీవల కాలంలో గణనీయంగా పెరిగాయని పేర్కొన్నారు. ఈ ప్రమాదాలను తగ్గించాలంటే ప్రతి వాహనదారుడు క్రమశిక్షణతో, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనం నడపాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే వాహనం ఎవరు నడిపినా చర్యలు తప్పవని, పోలీసులైనా మినహాయింపు ఉండదని స్పష్టం చేశారు.ప్రతి వాహనదారుడు తన కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్లక్ష్యంగా వాహనం నడపకూడదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కమిషనర్ సూచించారు. మీడియా ప్రతినిధులు సైతం ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. జీవితం ఎంతో విలువైనదని, చిన్న నిర్లక్ష్యం ప్రాణాంతకంగా మారవచ్చని హెచ్చరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం తెలంగాణ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోందని తెలిపారు. ‘ఆరైవ్ ఆలైవ్’ కార్యక్రమం ద్వారా ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. పిల్లలు తమ తల్లిదండ్రులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందిగా కోరాలని సూచించారు. మత్తుపదార్థాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, యువత వాటికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు రూపొందించిన ‘ఆరైవ్ ఆలైవ్’ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తమ వంతు సహకారం అందిస్తామని విద్యార్థులతో ట్రాఫిక్ అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీ సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సీతారెడ్డి, సుజాత, వెంకన్న, శ్రీనివాస్, కేయూసీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, స్కిల్ స్టోక్ పాఠశాల డైరెక్టర్ అనుప్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ నేతల కీలక సమావేశం

**కరీంనగర్,రతనాల వీణ ప్రతినిధి, జనవరి 21 :-**

కరీంనగర్ ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా నేతలకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, హుస్నాబాద్, హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల్లో పార్టీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. నేతల మధ్య సమన్వయం పెంపొందించడం, ప్రభుత్వ పథకాలను ఇంటింటా ప్రజల్లోకి తీసుకెళ్లడం, కేడర్‌ను చురుగ్గా పనిచేయించే అంశాలపై విస్తృతంగా చర్చించారు.మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, నాయకుడు సమిష్టిగా పనిచేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సిరిసిల్ల డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్,



ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.అలాగే కరీంనగర్, సిద్ధిపేట, సిరిసిల్ల జిల్లాల గ్రంథాలయ సంస్థ చైర్మన్లు సత్తు మల్లేష్, లింగమూర్తి, నాగుల సత్యనారాయణ గౌడ్, సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల ఆర్టీఏ సభ్యులు పడాల రాహుల్, సంగీతం శ్రీనాథ్, కరీంనగర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఇక కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు, హుజురాబాద్ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్, సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి, కరీంనగర్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

PRGI No: TGTEL/26/A0414

# రతనాల వీణ

తెలుగు సినిమా వార్తలు

www.rathanaalaveena.com

ఎడిటర్ : యస్ . చంద్రశేఖర్ రెడ్డి +91 9494234386 www.rathanaalaveena.com 22 - 01 - 2026

## మరో కొత్త కాన్సెప్ట్‌తో నవీన్ చంద్ర.. వెన్నులో వణుకు పుట్టిస్తున్న హనీ..!!

**రతనాల వీణ సినిమా :-**




నవీన్ చంద్ర కథానాయకుడిగా కరుణ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం హనీ తాజాగా విడుదలైన ప్రచార దృశ్యంతో ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేపుతోంది. ఈ చిత్రం నిజ జీవిత సంఘటనల ఆధారంగా, సమాజంలో ఉన్న మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాల నేపథ్యంతో రూపొందిన మానసిక భయానక కథగా కనిపిస్తోంది. సాధారణ భయానక చిత్రాలకు భిన్నంగా కేవలం భయపెట్టడం మాత్రమే కాకుండా ఒక రహస్యమయమైన ప్రపంచాన్ని తెరపై ఆవిష్కరించడంతో ప్రేక్షకుల్లో ఉత్కంఠ పెరిగింది. చీకటి వాతావరణం, నిశ్శబ్దం, మర్మమైన శక్తుల సమ్మేళనంతో దర్శకుడు ప్రతి దృశ్యాన్ని ఉత్కంఠభరితంగా మలిచినట్లు ప్రచార దృశ్యం తెలియజేస్తోంది. నవీన్ చంద్ర ప్రధాన పాత్రలో ప్రభావవంతమైన నటనతో కనిపిస్తుండగా, దివ్య పిళ్లై, దివి, రాజా రవీంద్ర పాత్రలు కథకు మరింత లోతు తీసుకొస్తున్నాయి. నేపథ్య సంగీతం ఉత్కంఠను పెంచుతూ భయానక భావాన్ని బలంగా ప్రేక్షకులకు చేరవేస్తోంది. ఛాయాగ్రహణం, కట్టుదిట్టమైన కూర్పు చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సామాజిక అంశాలతో పాటు మానసిక లోతు కలిగిన ఈ కథనం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించనుందని చిత్రబృందం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. ఫిబ్రవరి 6న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుండటంతో భయానక కథలను ఇష్టపడే ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి.

## పవన్ పీఎం అయినా ఆశ్చర్యం లేదు.. నిధి సంచలన మాటలు..!

**రతనాల వీణ సినిమా :-**




టాలీవుడ్‌తో పాటు రాజకీయ వర్గాల్లోనూ ఇప్పుడు ఓ వ్యాఖ్య పెద్ద చర్చకు దారి తీసింది. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గురించి హీరోయిన్ నిధి అగర్వాల్ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వేగంగా వైరల్ అవుతున్నాయి. హరిహర వీరమల్లు చిత్ర షూటింగ్ సమయంలో పవన్‌ను దగ్గర నుంచి గమనించిన నిధి, తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలపై ఆసక్తికరంగా స్పందించారు. పవన్‌ను కేవలం స్టార్‌గా మాత్రమే కాకుండా, లోపల బలమైన నాయకత్వ గుణాలు ఉన్న వ్యక్తిగా తాను చూశానని ఆమె తెలిపారు. ధైర్యం, తెగింపు, కష్టసమయాల్లో ఒంటరిగా నిలబడి పోరాడే మనస్తత్వం ఆయనలో స్పష్టంగా కనిపిస్తుందని చెప్పారు. పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో ఒక్కరోజులో ఎదిగిన వ్యక్తి కాదని, ఎన్నో సంవత్సరాల పాటు క్రమంగా పార్టీని నిర్మించుకుంటూ, ప్రజల మధ్య పనిచేస్తూ ముందుకు వచ్చారని నిధి వివరించారు. ఎన్నికల్లో వచ్చిన విజయం వెనుక ఆయన చేసిన కృషి ఎంతో లోతైనదని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలోనే భవిష్యత్తులో పవన్ దేశ అత్యున్నత పదవిని కూడా అధిరోహించినా తనకు ఆశ్చర్యం ఉండదని సంచలన వ్యాఖ్య చేశారు. ఆయనలో ఉన్న దూరదృష్టి, పట్టుదల, ప్రజల కోసం నిలబడే స్వభావం ఒక గొప్ప నాయకుడికి అవసరమైన లక్షణాలేనని విశ్లేషించారు. పవన్‌తో కలిసి పనిచేసిన అనుభవం తన వ్యక్తిగత జీవితాన్ని కూడా ప్రభావితం చేసిందని నిధి చెప్పారు. రాజకీయాల్లో ఎంత బిజీగా ఉన్నా సమయాన్ని సమర్థవంతంగా వినియోగించడం, స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగడం ఆయన ప్రత్యేకతగా పేర్కొన్నారు. మరోవైపు నిధి కెరీర్ విషయానికి వస్తే, ఇటీవల విడుదలైన చిత్రాలు ఆశించిన స్థాయి విజయాన్ని అందించకపోయినా, కొత్త అవకాశాల కోసం ఆమె ప్రయత్నాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. అయితే పవన్ కళ్యాణ్‌పై ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు మాత్రం సినీ రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చకు దారి తీస్తున్నాయి.

## ప్యాకప్ చెప్పిన మృణాల్.. ఉగాదికి దూసుకొస్తున్న డెకాయిట్..!

**రతనాల వీణ,మన సినిమా :-**



కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న అడివి శేష్ మరోసారి ప్రేక్షకుల్లో ఆసక్తిని రేపుతున్నాడు. భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న తాజా చిత్రం డెకాయిట్ షూటింగ్ కీలక దశకు చేరుకుంది. ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్న మృణాల్ ఠాకూర్ తన భాగానికి సంబంధించిన చిత్రీకరణను పూర్తిగా ముగించుకుంది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటిస్తూ, సెట్స్‌లో తీసిన కొన్ని ప్రత్యేక చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. అవి ప్రస్తుతం విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. అడివి శేష్ మృణాల్ కలయికపై మొదటి నుంచే మంచి ఆసక్తి నెలకొంది. ఇద్దరూ నటనలో అనుభవం కలవారే కావడంతో భావోద్వేగ దృశ్యాలు బలంగా ఉండబోతున్నాయన్న చర్చ వినిపిస్తోంది. ఇటీవలే కీలక షెడ్యూల్ పూర్తవడంతో ఇప్పుడు పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా కొనసాగనున్నాయి. సీతారామం చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువైన మృణాల్ ఈ సినిమాలో కీలక మలుపులు తిప్పే పాత్రలో కనిపించనుందని సమాచారం.డెకాయిట్‌ను ఈ ఏడాది మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని నిర్మాతలు నిర్ణయించారు. ఉగాది పండుగ సందర్భంగా థియేటర్లలోకి రానున్న ఈ చిత్రం తెలుగు హిందీ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది. పండుగ సీజన్ కావడంతో భారీ ప్రారంభ వసూళ్లు సాధిస్తుందనే అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం ప్రేమాత్మక యాక్షన్ కథాంశంతో తెరకెక్కుతోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార దృశ్యానికి మంచి స్పందన రావడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. అడివి శేష్ లుక్ ప్రదర్శన కొత్తగా ఉండటంతో ఈ ప్రాజెక్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. దర్శకుడిగా షానీల్ డియో బాధ్యతలు చేపట్టగా సంగీతాన్ని భీమ్స్ సిసిరోలియో అందిస్తున్నారు.

## బ్యాక్‌గ్రౌండ్ పాట రెడీ.. ఉస్తాద్ భగత్ సింగ్ నుంచి అదిరిపోయే అప్‌డేట్..!

**రతనాల వీణ సినిమా :-**







పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రం నుంచి అభిమానులకు అదిరిపోయే సమాచారం అందింది. ఇప్పటికే విడుదలైన మొదటి పాట ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్న నేపథ్యంలో తాజాగా బ్యాక్‌గ్రౌండ్ పాట సిద్ధమైందని చిత్ర బృందం వెల్లడించింది. ప్రముఖ గీత రచయిత చంద్రబోస్ ఈ పాటకు సాహిత్యం అందించగా ఆయన పంచుకున్న సంకేతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పవన్ కళ్యాణ్ స్టైల్‌కు తగ్గట్టుగా ఈ పాట ఉండబోతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్న దేవిశ్రీ ప్రసాద్ స్వరాలతో పవన్ కళ్యాణ్ వేనరిజం మరోసారి తెరపై మెరవనుందని అభిమానులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలో పవన్ డ్యాన్స్, ఎనర్జీ ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. ఇప్పుడు బ్యాక్‌గ్రౌండ్ పాట కూడా అదే స్థాయిలో మాస్‌ను ఆకట్టుకుంటుందని టాక్ వినిపిస్తోంది. గ్లింప్స్‌లో పవన్ చెప్పిన డైలాగులు సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటిస్తుండగా రాశీ ఖన్నా కీలక పాత్ర పోషిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా గబ్బర్ సింగ్ తరహా మాస్ ఎంటర్టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రానుందని సమాచారం. మార్చి చివరి వారంలో లేదా ఏప్రిల్‌లో విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.




## విశాల్ - తమన్నా కొత్త సినిమా అనౌన్స్

**రతనాల వీణ సినిమా :-**




తమిళంతో పాటు తెలుగులో కూడా మంచి మార్కెట్ ఉన్న హీరోల్లో విశాల్ ఒకరు. ఇటీవల 'మార్క్ ఆంటోని', 'మదగజరాజ' సినిమాలతో హిట్స్ అందుకున్న విశాల్ ప్రస్తుతం మూడు నాలుగు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.ఈ నేపథ్యంలో విశాల్ తన 36వ సినిమాను అధికారికంగా ప్రకటించారు. విశాల్ హీరోగా, తమన్నా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి సుందర్ జ దర్శకత్వం వహిస్తుండగా, అరుణ్ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు తెలుగులో 'మొగుడు' అనే టైటిల్‌ను ఫిక్స్ చేస్తూ మేకర్స్ ఆసక్తికరమైన గ్లింప్స్‌ను విడుదల చేశారు. గ్లింప్స్‌లో తమన్నా భర్తకు ఆర్డర్స్ వేసే భార్యగా కనిపిస్తుండగా, విశాల్ ఇంట్లో పనులు చేసే సాధారణ మొగుడిగా, మరోవైపు సీక్రెట్‌గా యాక్షన్ చేసే హీరోగా కనిపించడం ఆకట్టుకుంటోంది. మధ్య మధ్యలో యోగిబాబు కామెడీ సినిమాకు మరింత ప్లస్‌గా నిలుస్తోంది. 'మొగుడు మొగుడిలా ఉండాలిడ' అనే డైలాగ్‌తో గ్లింప్స్ ప్రేక్షకుల్లో నవ్వులు పూయిస్తోంది.ఈ గ్లింప్స్ ద్వారా సినిమా పూర్తిగా కామెడీ, యాక్షన్ మేళవింపుతో కూడిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. విశాల్ ▪ తమన్నా కాంబినేషన్, సుందర్ జ స్టైల్ ఎంటర్‌టైన్‌మెంట్ సినిమాపై అంచనాలను పెంచుతోంది.ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది. తాజాగా విడుదలైన 'మొగుడు' గ్లింప్స్ సోషల్ మీడియాలో మంచి స్పందనను రాబడుతూ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది.

Printed,Published and Owned by Chandrasekhar. S, 8-4 369/SF/3 Block B, Azam Nagar, Ste - 3, Borabanda, Rangareddy, TELANGANA - 500018. and Printed at M/s MANA NEWS BROADCASTING TELEVISION NETWORKS , 8-4 369/SF/3 Block B, Azam Nagar, Ste - 3, Borabanda, Rangareddy, TELANGANA - 500018. Chief Editor : Chandrasekhar.S, email:mananews89@gmail.com, Cell:9494234386, RNI(PRGI) No: APTEL/26/A0414